# రచన

ఈ మధ్య వస్తున్న కథల్ని చదివినప్పుడల్లా ఓస్....ఇంతేగా....అని అనిపిస్తుండేది. కానీ కథ రాయడం చాలా కష్టం అనే విషయం కథలు రాయాలనే రంగంలోకి దిగిన తర్వాత కూడా తెలీలేదు.

ఎన్నెన్నో వూహలు....

కాగితంమీద పెట్టాలని కూర్చున్నప్పుడు ఏవీ గుర్తుకొచ్చేవి కాదు. గుర్తుకొచ్చినా ఆ వూహలకి అక్షరరూపం ఇవ్వడం పెద్ద సమస్య!

ఎంతో కాలాన్ని, ఎన్నో కాగితాల్ని తగలేసి ఆఖరికి ఓ కథని దిగ్విజయంగా పూర్తి చేశాను. ఓ పత్రికకి పంపాను. అంతకన్నా అర్జంటుగా అది వెనక్కి తిరిగి వచ్చేసింది.

తెలుగులో వున్న వార, పక్ష, మాసపత్రిక లన్నింటికి దాన్ని పంపాను. అన్ని చోట్లనుంచి వెనక్కి వచ్చేసింది.

విసుగు చెందని విక్రమార్కుడిలా మరి కొన్ని కథల్ని రాశాను. నన్నే వెదుక్కుంటూ వెనక్కి వచ్చేసేవి.

తిరిగి వచ్చిన కథల్ని చదివితే అన్నికథలూ మేగజైన్లలో చదువుతున్న కథలకన్నా బాగా వుంటున్నట్లే అనిపించేవి. మరెందుకు తిరిగి వస్తున్నాయి? అర్థంగాని ప్రశ్న.

పట్టుదలతో నేను రాసే కథల సంఖ్య ఎలా పెరుగుతోందో, తిరిగి వచ్చే వాటి సంఖ్య అలానే పెరుగుతోంది.

తిర్ర కొట్టినందుకు కాదు, తోడికోడలు నవ్వినందుకు అన్నట్లు కథలు తిరిగి వస్తున్నందుకన్నా వాటిని చూసి నవ్వుతున్న భార్యామని చూసేసరికి విపరీతమైన బాధ వేసేది.

తన తమ్ముడే పెద్ద రచయిత అయినట్లు, నేనెందుకూ పనికిరాని చవటని అని ఆమె నవ్వుతున్నట్లనిపించేది. ఉక్రోషం వచ్చేది. పట్టుదల పెరిగిపోయేది.

ఫలితం పోస్ట్‌మన్‌కి పని పెరగడం తప్ప మరేమీలేదు!

ఇక లాభంలేదు. ముందు కథల స్వరూపాల్ని పరిశీలించాలి.

తాత్కాలికంగా కథల్ని రాయడం ఆపి, ఇంగ్లీషు, తెలుగుభాషల్లో కనిపించిన కథనల్లా చదవడం మొదలుపెట్టా.

ఎన్ని ఎక్కువ భాషల కథల్ని చదివితే అన్ని ఎక్కువ కథల్ని రాయవచ్చు అనే ఓ మిత్రుడు సలహాని పాటించి కష్టపడడం ప్రారంభించాను.

కష్టేఫలి అన్నట్లు చదివి కష్టపడి, కష్టపడి ఓ కథని రాశాను. బాగానే వచ్చినట్లనిపించింది. ఫెయిర్ చేస్తున్నప్పుడు దాని స్వరూపం మరికొద్ది మారింది.

ఏమైనాసరే ఈ కథ ప్రచురించబడాల్సిందే! పట్టుదల పెరిగింది.

హఠాత్తుగా ఓ ఆలోచన వచ్చింది.

మా వూళ్ళోనే వున్న ఓ ప్రముఖ రచయిత రాజీవ్ గుర్తుకొచ్చాడు. అతని కథ పడని పత్రిక తెలుగులో లేదు. ఎన్నో కథలకి బహుమతుల్ని కూడా పొందాడు.

ఆయనకి నా కథని చూపించి అవసరమైన మార్పులు చేయిస్తే తప్పకుండా ప్రచురించబడుతుంది.

వెంటనే రాజీవ్ దగ్గరికి బయల్దేరాను.

నన్ను నేను పరిచయం చేసుకుని నా బాధని ఆయనకి చెప్పుకున్నాను.

''ఈ కథని చదివి మీ అభిప్రాయం చెప్పండి'' అంటూ ఆ కథని ఆయనకి ఇచ్చాను.

ఇంతలో శ్రీమతి రాజీవ్‌గారు కాఫీలు తేవటంతో మా మధ్య చిరు అంతరాయం కలిగింది.

కాఫీ తాగుతూనే రాజీవ్ కథని చదవసాగాడు.

నాకు కాఫీ గొంతు దిగడంలేదు. కథని చదువుతున్నప్పుడు అతని ముఖకవళికల్ని గమనిస్తూ ఒక్కో గుక్కే తాగసాగాను.

నా కాఫీ పూర్తికావడం, అతను కథ చదవడం ఒకేసారి జరిగాయి. రిజల్టుకోసం ఎదురుచూస్తున్న విద్యార్థిలా వుంది నా పరిస్థితి!

''ఎలా వుంది?" ఆత్రంగా అడిగాను.

''ఖచ్చితమైన అభిప్రాయం చెప్పమంటారా?''

"చెప్పండి...."

''ఇది పరమ చెత్తకథ, ఎవ్వరూ వేసుకోరు. ఒక్క ముక్కలో ఇదీ నా అభిప్రాయం.''

తలమీద కర్రతో కొట్టినట్లనిపించింది. అంత నిర్మొహమాటంగా ఆయన అలా అభిప్రాయాన్ని చెబుతాడని నేనూహించలేదు. అవాక్కయి అలా చూస్తూ కూర్చున్నాను.

"కథలు రాయడం అంత తేలిక కాదండీ! అది ఒక విద్య. అంత తొందరగా పట్టుబడేది కాదు. బాగా కృషి చేయాలి...." తను మొదట్లో కథలు పడక ఎన్ని ఇబ్బందులు పడింది, ఇప్పుడు తన చుట్టూ ఎడిటర్లు

ఎలా తిరుగుతున్నది. ఏవేవో అతను చెప్పుకుపోతున్నాడు. నాకు మనసుకి ఎక్కడంలేదు.

కేవలం సభ్యతకోసం కాసేపు కూర్చుని బయల్దేరాను.

ఇంటికి రాగానే కోపంతో ఆ కథని ముక్కలు ముక్కలు చేశాను. అంతటితో వూరుకోకుండా ఓ అగ్గిపుల్లతో వాటిని తగలేశాను. ఆ మంట మీద చెయ్యి పెట్టి మళ్ళీ కథలు రాయగూడదని వట్టేసుకున్నాను.

ఇది దాదాపు ఆరునెలల నాటి సంగతి!

అప్పటినుంచి మళ్ళీ కథ రాయాలనే వూహ రాలేదు. కానీ కథలు చదివే అలవాటుని మాత్రం మానుకోలేకపోయాను.

ఆ రోజు భోజనం కాగానే పడక్కుర్చీలో పడుకుని కొత్తగా వచ్చిన వారపత్రికని తిరగేయసాగాను.

హఠాత్తుగా నా చూపు ఒక పేజీలో నిలిచిపోయింది.

ఆ పత్రిక నిర్వహించిన కథల పోటీలో ప్రముఖ రచయిత రాజీవ్ కథకి మొదటి బహుమతి వచ్చింది అతనిఫోటో, వివరాలు ప్రచురించారు.

అతని కథని చదవసాగాను.

కథ పూర్తవడం, నా కళ్ళు గిర్రున తిరగడం ఒకేసారి జరిగాయి.

ఆ కథ చాలా బాగుంది.

కానీ—

ఆ కథనే నేను రాసుకుని తీసుకు వెళ్ళినప్పుడు అతను "పరమ చెత్త కథ'' అని వ్యాఖ్యానించాడు.

ఆ కథనే నేను కసితో ముక్కలు ముక్కలుగా చేసి తగల బెట్టాను.

కాకపోతే నాకన్నా అతను అనుభవం వున్న రచయిత కావడంతో దాన్ని మరింత అందంగా మలిచాడు— అంతే! *

(ఈవారం వారపత్రిక)